# ★ ఆ శ ని రా శ ★

దే. నా. మూర్తి.

ఆవి నేను విశాఖపట్నం కాలేజిలో ఇంటర్మీడియేటు చదువుతున్న రోజులు. నాకు హాస్టల్లో సీటు దొరకలేదు. లాడ్జికోసం వూరంతా వెతకగా కాలేజికి అరమైలు దూరంలో ఒక డాబామీద గది దొరికింది ఆగదిలో ఎలెక్ట్రిక్ దీపంకూడావుంది. అందుచేత వెంటనే అందులో బసపెట్టేను. ఆ డాబాకు అరగజం దూరంలోనే మరొక డాబావుంది. నేను ఆలాడ్జిలో బసపెట్టిన వారంరోజుల అనంతరం, ఒకనాడు సాయంత్రం నేను కాలేజీనుంచి వచ్చి డాబా ఎక్కేసరికే నేనుండే యింటావిడ మాడాబా మీద నిలుచుని ప్రక్క డాబామీదనున్న ఒక అమ్మాయితో మాట్లాడుతున్నాది ఆ అమ్మాయికి పదిహేడు లేక పద్దెనిమిదేళ్ళుంటాయి. అందంగానే కనిపించింది నా కంటికి. నేను ఒకసారి ఆ అమ్మాయికేసిచూసి (కోప్పగకండి. ఒక అమ్మాయి కనుపించగానే అటువైపు ఒకసారిచూడటం పురుషజాతికి సహజం) నామానాన్ని నాగదిలోనికి పోయేను

ఆ మర్నాడు సాయంత్రం నేను కాలేజీనుంచి వచ్చేసరికి ఆ అమ్మాయి వాళ్ళ డాబామీద అరవేసిన బట్టల్ని తీస్తున్నాది నన్నుచూసి "ఏమండీ ఎర్రంచుల తువ్వాలు కాని మీ డాబామీదకు ఎగిరిపడ్డాదేమో చూస్తారా?" అంది నేను మాట్లాడకుండా మా డాబామీద కెగిరివచ్చిన ఎర్రంచుల తువ్వాల్ను ప్రక్క డాబామీదకు విసరి నా రూములోనికిపోయేను

ప్రతీరోజూ సాయంత్రం కాలేజీనుంచి వచ్చేసరిక్క ఆ అమ్మాయి బాగా టాయిలెట్ అయి-అంటే సుమారు ఒక అరంగుళం మందాన్ని పౌడరు, స్నో మొగానికి పూసుకుని, కాస్త తల దువ్వుకుని శుభ్రమైన బట్టవేసుకుని డాబామీద పచారుచేస్తూ వుండేది. చండికలో కన్నాంబలాగ, గృహప్రవేశంలో భానుమతిలాగ, గొల్లభామలో అంజలాదేవిలాగ ఆ అమ్మాయి విపరీతమైన పోజులు కొట్టూవుండేది

ఒకరోజు సాయంత్రం నేను కాలేజీనుంచి వచ్చేసరికి ఆ అమ్మాయి వాళ్ళ డాబామీద నిలుచుని ఏదో పాట పాడుతున్నాది. ఆ అమ్మాయి వెనుకకు తిరిగి వుండడంవల్ల నన్ను చూడలేదు అలా రమారమి మూడు నిమిషాల కాలం అట్లానే నిలుచున్నా ఆ అమ్మాయి వెనక్కు తిరిగి నన్నుచూసింది వెంటనే పాట ఆగిపోయింది నవ్వుకుంటూ పారిపోయింది ఆ అమ్మాయి ఎవరుచెప్మా? అనుకున్నా. వెంటనే ఎంక్వైరీ ప్రారంభించేను. ఆ అమ్మాయివాళ్ళ నాన్న కలెక్టరాఫీసులో పనిచేస్తున్నట్లూ, ఆమె అతని ఏకపుత్రిక, అవివాహిత, అరవఫారం దండయాత్రచేసి స్కూలుకు స్వస్తిచెప్పినట్లు తెలుసుకున్నాను అవునట్లు చెప్పడం మరచేను ఆ అమ్మాయి పేరు కమల,

ఒకనాడు మధ్యాహ్నం నా తువ్వాలు ప్రక్క డాబా మీదకు విసరి కాలెజీకిపోయేను. కాలేజీనుంచి వచ్చేను కాని ఆ అమ్మాయి డాబామీదలేదు, ఒక అరగంట నాగదిలో కూర్చున్నాను అంతలో ప్రక్క డాబామీద, "ఈ తువ్వాలెవరిది? ప్రక్క డాబామీదనుంచి ఎగిరి పడ్డాదికాబోలు" అని ఎవరో అనుకుంటున్న మాటలు వినబడ్డాయి. నేను నా గదిలోంచి బయటకువెళ్ళేను "అబ్బాయీ! యీ తువ్వాలు మీదికాబోలు గాలికి మా డాబామీది కెగిరిపోయింది." అని ఒకావిడ నా తువ్వాలు విసరేసింది "అవునండీ నాదే యీ తువ్వాలు" అని నేను తువ్వాలు తీసుకుని గదిలోనికిపోయేను ఆవిడ ప్రక్కనే కమల ఉంది. బహుశా ఆవిడ కమల తల్లి అయివుండాలి. వారంరోజుల తరువాత నాచేతిరుమాలొకటి ఆడాబామీదకి విసరేసేను మూడు రోజులైనాక ఒకనాటి సాయంత్రం "ఏమండీ యీ రుమాలు మీదికాబోలు మా డాబామీది కెగిరివచ్చింది" అని కమల ఒక రుమాలు మా డాబామీద పడేసింది అది నారుమాలు కాదు అందుమెద రంగుదారాలతో ఏవో లతలు కుట్టబడివున్నాయి నేను పడేసిన రుమాలు మీద అసంబంధమైన వేమీలేవు. నాకంతా బోధపడ్డాది కానీ ఏమీ ఎరగనట్లు "నేను అరవేసిన రుమాలొకటి కనిపించలేదు కాని మీరిచ్చినది మాత్రం నాదికాదు" అన్నాను.

'అయితే, పాపం, మరేంచేస్తారు?" మీ రుమాలువంతు నేనిచ్చిన రుమాలు వాడుకోండి." అని నవ్వుకుంటూ పారిపోయింది

మరోనాడు సాయంత్రం కాలేజీనుంచి వచ్చేసరికి కమల డాబామీద నిలుచుని పోజులుకొట్టున్నాది. ఆమెవేపు రెప్పవేయకుండా చూస్తూ నిలుచుండిపోయేను. ఆమె నావేపుచూస్తున్నాది. సుమారు రెండు నిమిషాలైంది నాకు నవ్వొచ్చి ఫకాలున నవ్వేను

"నావేపుచూసి ఎందుకలా నవ్వుతారు? మీకు మర్యాదల్లేవుంది. మీ ప్రవర్తన ఏమీ బాగులేదని యీ యింటివాళ్ళతోచెప్పి మిమ్మల్ని గదిలోంచి " అంది కోపంగా. నాకామె మాటలు వినేసరిక్క ఆశ్చర్యం, భయంవేసింది.

"ఎక్స్క్యూజ్ మి, పొరపాటే" అని వెళ్ళిపోతూవుంటే ఆ అమ్మాయి "ఏ మండోయ్" అని నన్ను పిలచింది. నేనటువైపు తిరిగేసరికి నవ్వుచూ "ఎక్స్క్యూజ్ మి." అంది.

"మీకు మర్యాద తెలుసునుగా. ఇదేనా మర్యాదా?' అన్నా కోపంగా.

"ఆ మాత్రందానికే కోపం తెచ్చుకోవాలా? మీదగ్గరేమే నాకథల పుస్తకాలుంటే యిస్తారా?" అంది నవ్వుతూ.

"నా దగ్గర అల్లాంటివేమీ లేవు. ఇప్పుడు మనల్నెవరేనా చూస్తే "

"అయితే ఎవ్వరూ చూడకుండా వున్నప్పుడే మాట్లాడుకుందాం."

అదిమొదలు వీలైనప్పుడల్లా నేనూ, కమలా ఒకరితొకరు మాట్లాడుకుంటూ వుండేవాళ్ళం. మాస్నేహం క్రమక్రమంగా అభివృద్ధికా సాగింది.

ఒకనాడు రాత్రి హొటలునుంచి భోజనంచేసివచ్చి నా గదితలుపు తీస్తూవుంటే గుమ్మం ముందర కాలి కేదో గిలింది. టార్చిలైటు వెలిగించిచూస్తే అదొకపొట్లం. విప్పిచూస్తే అందులో లాడూలు మొదలైన తినుబడి సామాన్లున్నయ్. కమలే ఆపొట్లం అక్కడ పెట్టిందని నాలో అనుకుని నవ్వుకున్నాను ఆ మర్నాడు కాలేజీనుంచి వచ్చేసరికి కమల మామూలుగా టాయిలెట్ అయి డాబామీద పచారు చేస్తున్నాది. నన్నుచూసి మరొకవైపు తిరిగిపోయింది. నేను నవ్వుకుంటూ ఆమె నావైపు చూస్తుందని నిలుచున్నాను. అయిదు నిమిషాలు కాలం గడచిందికాని ఆమె నావేపు తిరగలేదు.

'కమలా, నేను రేపు యిలాడ్జి మార్చేస్తున్నాను"

"ఆఁ నిజంగానా?" అంది వెంటనే నావేపు తిరిగి.

"నిజంగానే,"

"ఎందుచేత యిలాడ్జి మార్చేస్తున్నారు? ఈలాడ్జి మీకు నచ్చలేదూ?"

"అబ్బే అదికాదు.",

"అయితే మరెందుకీ లాడ్జి మార్చేస్తున్నారు?"

"అనవసరంగా నీకు కోపంకలిగించేనని."

"మీరు నాకు కోపంకలిగించేరని ఎవ్వరన్నారు?" అంది ఆశ్చర్యంగా.

"ఒకరనాలా యేమిటి? నువ్వు నన్నుచూసి అటువైపు తిరిగిపోతే మరేమి టనుకునేది? నీకు కోపంకలిగించి యిలాడ్జిలో వుండడ మెందుకని...."

"ఒస్సి ఎంత గమ్మత్తుచేసేరు!" అంది పకపక నవ్వుతూ. "మీరు బలే గమ్మత్తుచేసేరండీ"

"నీ కంటేనా? ఒక డాబామీదనుంచి మరొక డాబా మీదకు దాటిరావడం గమ్మత్తుకాదూ?" అన్నాను నవ్వుతూ.

"నిన్నటి లాడూలు ఎలాగున్నాయి?"

చాలా బాగున్నాయి కాని నీ అంత బాగులేవు"

"అదుగో. మా అమ్మ పిలుస్తున్నాది" అని కమల పారిపోయింది

నేనెంత చిరాకుగావున్నా కమల నొకసారిచూసి ఆమెతో మాట్లాడేసరికి నాలో క్రొత్తగా వుత్సాహం జనించేది. సాయంత్రం కాలేజీనుంచి వచ్చేసరికి వాళ్ళ డాబామీదనుంచి ఒక చల్లనిచూపు, చిరునవ్వు కమల విసరేసరికి నాకు కడుపునిండి నట్టనిపించేది. ఆమె చిరునవ్వు నందుకుని చిరునవ్వుతోనే సమాధానంచెప్పి గేమ్ ఆడుకోడానికి పోయేవాడిని కమలని చూడకుండా ఎప్పుడేనా గేమ్‌కివెళ్తే ఆవేళ అదేమిటోగాని ఏమీ ఆడలేకపోయేవాడిని. నాచేతిరుమాళ్ళమీద రకరకాల పువ్వుల లతలు కుట్టుతూవుండేది ఆమె. మా యిద్దరిస్నేహం క్రమంగా ప్రేమగామారి దినదినాభివృద్ధి కాజొచ్చింది.

ఒకరోజు సాయంత్రం తలనొప్పిగా వుండడంవల్ల నేను కాలేజీ వదలడంతోనే లాడ్జికివచ్చి పడుకున్నాను. తలనొప్పి తగ్గక పోవడమే కాకుండా జ్వరంకూడా వచ్చింది అరాత్రి తీవ్రమైన జ్వరమొచ్చింది ఆ మర్నాడు మధ్యాహ్నంవరకూ జ్వరంతగ్గలేదు. కడుపులో కాఫీయేనా పడనందువలన నీరసంగావుంది. జట్కా చేయించుకుని కాఫీ క్లబ్బుకిపోయి కాఫీత్రాగి, మా ఫ్రెండునిఫాస్కు అడిగి దానితో కాఫీతెచ్చుకొని మళ్లా రూముకివచ్చి పడుకున్నా. నేను ఫ్లాస్కుతో నాగదిలోనికి పోతూవుంటే కమల వాళ్ళ డాబామీదనుంచి నన్నుచూసి నావంట్లో బాగాలేనట్లు తెలుసుకుంది. వాళ్ళమ్మ ఆమె ప్రక్కనే వుండడంవలన నాతో మాట్లాడలేదు.

అరాత్రి నాకు తలపోటు, జ్వరం మళ్ళా అధికమైంది. అబ్బ తలపోటు వొళ్ళంతానొప్పి విపరీతమైన బాధ. నాబాధ నాకేతెలుసు, దేవుడికేతెలుసు మరొకరికి తెలీదు. నేనా బాధభరించలేక బిగ్గరగా ఏడ్చేద్దా మనుకున్నాను. కాని విన్నవాళ్ళు నవ్వుతారని నాలో నేనే ఏడుస్తున్నా. ఎప్పుడూ దేవుడిని తలచనివాడిని అప్పుడు దేవుడిని ప్రార్థించడం మొదలెట్టేను నాబాధ తగ్గిస్తాడేమోనని.

గదిలో ఎలక్ట్రిక్ దీపం వెలుగుతున్నాది. వాచీ టిక్, టిక్‌మంటూ పన్నెండుగంట లైందనిచెప్పి తనపని చేస్తున్నది. రెండో ఆటసినీమావదిలేరుకాబోలు. జనం మాట్లాడుతుం

టూ పోతున్నారు. నేను తలపోటు, జ్వరంతో బాధపడుతు న్నాను కాని వాళ్ళకేం? ఎవరి బాధ ఎవరికి కావాలి? ఇం తలో నాగది బయట ఎవరోనడుస్తున్నట్లు అడుగుల చప్పు డైంది. క్రమక్రమంగా ఆ చప్పుడు నాగది గుమ్మం ముం దరే వినిపించింది. "ఇంత రాత్రివేళ నాకోసంవచ్చేదెవరు? దొంగలు తప్ప మరెవరూ కాదు" అనుకుని "ఎవరది?" అన్నాను గట్టిగా, మంచంమీదనుంచి లేచి.

"ఇస్సు గట్టిగా మాట్లాడకండి, నేను కమలని' కమల గదిలోనికివచ్చి తలుపులు చేరవేసింది. ఆమె ధై ర్యానికి నా కాశ్చర్యంవేసింది అంత రాత్రివేళ ఎందు కొచ్చిందో



"మీవంట్లో ఎలాగుంది? జ్వరంవచ్చి నట్లుందే?"

"రెండు రోజులనుంచి జ్వరంవస్తున్నాది. ఇవాళ రాత్రి తలపోటూ, జ్వరం, వెళ్ళునొప్పి అధికమైంది. చాలా బాధగావుంది కమలా."

"అమృతాంజనం వున్నాదా?"

"వున్నాది." అని అమృతాంజనం సీసా ఆమెకు చూపించేను. ఆమె అమృతాంజనం తీసుకొచ్చి తన మృ దువైన హస్తాల్తో నా నుదురుకు అమృతాంజనం రాస్తూ నా మంచంమీద కూర్చుంది. ఆమె శరీరాన్ని తాకేసరికి నాకు వొళ్ళు జలదరించింది. కాని బాధ తగ్గినట్లుండడం వల్ల అలాగే పడుకున్నా. సుమారొక అరగంట గడిచింది.

"ఇకచాల్ను కమలా, తలపోటు కొంచెం తగ్గింది. నాకు సహాయం చేయడానికి నిన్నిప్పుడు దేవుడే పంపించేడు ' మలా నువ్వుచేసిన పరిచర్యకు చాలా కృతజ్ఞుణ్ని."

కమల నవ్వి వూరుకుంది.

"ఇలావచ్చి కూర్చో కమలా." అని ఆమె చేతులు పట్టుకుని నా ప్రక్క కూర్చోపెట్టేను.

"ఇప్పుడు మీవంట్లో ఎలాగుంది?"

"ఇప్పుడు నావంట్లో కాస్త కులాసాగావుంది. నిన్ను చూస్తూవుంటే ."

"ఇంతవరకూ తలపోటు అని మూ లుగుతూ అప్పుడే తగ్గిపోయిందా?" అంది నవ్వుతూ.

'అదంతా నీ ప్రభావమే కమలా వొకసారి విన్నుచూసి నవ్వుతే యీ యింటి వాళ్ళతో చెప్తానన్నావు. ఇప్పుడు మీవాళ్ళని పిలిచేదా?" అన్నాను ఆమె చేతులు జాడిస్తూ.

"అంత ధైర్యం వుంటేగా?" అంది నవ్వుతూ.

"కమలా ఎల్లుండినుంచి మాకు ద సరా శలవులిస్తారు నేను శలవులకి మా వూరుపోతున్నా,"

"మళ్ళా ఎప్పుడొస్తారు?" అంది నాక ళ్ళల్లోకిచూస్తూ.

"మళ్ళా యిరవైరోజుల్లో వచ్చేస్తాను. మళ్ళా శలవు లాఖర్ని యిలా మన మిద్ద రం కలుసుకుందాం, ఏం కమలా?"

"ఇరవైరోజులదాకా మిమ్మల్ని చూ డకుండా వుండగలనా?"

"మరెలాగ వుండలేకపోతే? దసరా సెలవుల్నించి వచ్చేక కలుసుకుందాం, నేను మాత్రం నిన్ను వదిలివుండ గలనేంటి?"

"అయితే దసరా శలవుల్నించివచ్చేక కలుసుకుం దాం" అంది కమల నాచేతులు కదుపుతూ, అప్పుడు.రెం డుస్సర అయింది.

"నేనువచ్చి చాలా సేపైంది. ఇంక వెళ్ళిపోతాను.'

"అప్పుడే రెండున్న రైందా?"

"అo ఇంక నేను పోతాను" అని వొక్క పెట్టుకుని కమల వెళ్ళిపోయింది.

ఆమె శరీరం నాకు తగలడంవల్ల కాబోలు, తెల్లవారే సరికి నా జ్వరం, తలపోటు చాలావరకూ తగ్గేయి. ఆవేళ ల్లా రాత్రి జరిగిన సంఘటన తలుచుకుంటూ కాలం గడిపేను. శలవులిచ్చేసేరు. నేను మావూరు వెళ్ళి పోయేను.

మా వూరులో నా దేహంవుంది కాని నా మనస్సంతా కమల మీదేవుంది, శలవుల్లో ఏదేనా చదవడానికి పుస్తకం తీసేసరికి చిరునవ్వు మొగంతో కమల నా కళ్ళముందర ప్రత్యక్షమయ్యేది. మరి చదవడానికి బుద్ధిపుట్టేది కాదు, క్షణమొకయుగంలాగ శలవులన్నీ గడిపేను. శలవులు పూర్తి అయిపోయేయి. నేను మళ్ళా విశాఖపట్నం చేరు కున్నాను,

మామూలుగా సాయంత్రం కాలేజీనుంచివచ్చేను, డాబామీద కమల కనిపించలేదు ఆవేళ సాయంత్రం గేమ్‌కి పోవడంమాని డాబామీద పచారుచేస్తూ నిలుచున్నా కాని కమల దర్శనంకాలేదు నాకేమీ తోచడంలేదు. ఆమెను ఎంత వేగరంచూస్తానా అని ఆతురతపడుతున్నా, "కమల ఏమైంది? ఏదేనా వూరికెళ్ళిందేమో? లేక సినీ మాకు వెళ్ళిందేమో?" నా మనస్సు కమల ఎక్కడికి వెళ్ళిందో తెగ వెతుకుతున్నాది చీకటిపడ్డాది మిణుకు, మిణుకులాడుతూ నక్షత్రాలు ఆకాశంమీద అవ తరించేయి. ఆనక్షత్రాలవెలుగు ప్రపంచంలోని చీకటిని కొంతవరకు తగ్గింపగలిగింది కాని నా హృదయంలోని చీక టిని తొలగింప లేకపోయింది. ఆచీకటిని తొలగించడానికి శక్తిగలది కమల వొక్కతే

హొటలుకెళ్ళి భోజనంచేసివచ్చి గదిలొకూర్చున్నా, నా మనస్సులో చెప్పరాని ఆందోళనగావుంది. టిక్ టిక్ మంటూ వాచీలోని ముళ్ళు పరుగుతో తిరుగుతున్నయ్. రాత్రి పది, పదకొండు, పన్నెండు, ఆఖరుకి వొంటిగంట వరకూ నేనలా కూర్చున్నా.

వొంటిగంట అవగానే టార్చిలైటు తీసుకుని మాడాబా మీదకువెళ్ళేను. గుండె వడిగా కొట్టుకుంటున్నాది. ఎవరే నాచూసారేమోనని భయంవేస్తున్నాది మెల్లిగా అడుగులు వేస్తూ డాబా మెట్లుదిగి కమలా వాళ్ళింట్లొకి ప్రవేశించేను. ఎక్కడా దీపంలేదు ఎమీ అలికిడికూడాలేదు. టార్చిలైటు వెలిగించిచూసేను. గదులన్నీ తాళాలువేసి వున్నాయి. కమలావాళ్ళూ ఏదోవూరికివెళ్ళి వుంటారనుకుని నిరాశతో నా రూములోనికి పోయేను. "కమల ఎప్పుడు వస్తుందో? కమల నెప్పుడు చూస్తానో?" అనుకుంటూ పడుకున్నాను,. నాకు తెలియకుండా నిద్ర నన్ను తనలో లీనంచేసుకుంది

ఆ మర్నాడు కాలేజీలో పోస్టుమేన్ నాకో కవరుయి చ్చేడు కవరు ఆతృతతో చింపిచూసేను. అందులోని వుత్త రంలో యిలావుంది.

మోహనరావు గార్కి:—

నమస్తే. మానాన్నగార్కి శ్రీకాకుళం ట్రాన్సుఫర్ అయింది మేం యిక్కడికవచ్చి పదిరోజులు దాటింది. మిమ్మల్ని మరొకసారి కలుసుకునే భాగ్యంనాకు లేకపోయి నందుకు చాలా విచారిస్తున్నాను. అయినా దేవుడి దయలే నప్పుడు మనం ఏంచేస్తాం? దేవుడు మనల్ని సృష్టించేడు కనుక అతని ఆనతులను మనం శిరసావహించాలి తరు వాత మనం యీ జన్మలో మళ్ళాకలుసుకునే అవకాశాలు లేవు. అందుచేత వొకర్నొకరు మరచిపోవడం చాలా వుత్త మం నిజంగా మనం వొకర్నొకరం మరచి పోవడం చాలా కష్టం. కాని మరచి పోక వీలులేదు నేనే యీవుత్తరం వ్రా స్తున్నానా? అనే సందేహం మీకు కలగ వచ్చును. మనం యెలాగ కలుసు కున్నామో అలాగే విడిపోయేం. అనవస రంగా నన్ను మనస్సులో పెట్టుకుని మీ చదువు పాడుచేసు కోకండి క్షమించి యీ దీనురాల్ని మరచిపోండి. పోనీ మీవాళ్లనొప్పించి నన్ను పెళ్లి చేసుకుందా మనుకుంటే. మేంద్రావిడులం మీరు వైదీకులు ఇది జరగడం అసంభ వం. మీ దగ్గరనుంచివచ్చే వుత్తరాలను చూడడానికైనా నాకు అదృష్టంలేదు నాకలం మరి నడవకుండావుంది. క్షమించి యీ దీనురాల్ని మరచిపోండి. అదే వుత్తమం. దేవుడు మిమ్మల్ని రక్షించుగాక. శలవు

ఇట్లు కమల,

ఆ వుత్తరం చదివేసరికి నా కళ్ళంట నీళ్ళు తిరిగేయి, నా హృదయంలో కార్చిచ్చు రగుల్కొన్నట్లయింది. నాహృద యం ఎల్లా వుంటుందో బాగా ఆలోచిస్తే మీకేతెలుస్తుంది. భాగ్యలక్ష్మి సినీమాలో నాగయ్యగారు పాడిన "ఆశానిరాశా" అన్న పాట నాకు జ్ఞాపకంవచ్చింది. నిజంగా నా ఆశ నిరాశ అయింది.